News Daily

ఎడిటర్ :

B. ఉపేందర్

cknews7484@gmail.com

Visit in :
www.cknewstv.in

CK
చంద్ర కాంత్

CK NEWS

తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :292 | ఖమ్మం | సోమవారం, నవంబర్ 23, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు

- ప్రపంచ బ్యాంకు నివేదికతో దేశానికి గర్వకారణం
- బీజేపీ పాలనలోనే ఈ ఘనత సాధించామన్న మోదీ
- పేదల సంక్షేమానికి పథకాలే కీలకం
- బ్యాంకు ఖాతాలు, గ్యాస్, విద్యుత్‌తో ప్రయోజనాలు
- సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించాం
- రాబోయే తరాలు స్వర్ణయుగాన్ని చూస్తాయి



ప్రేమకు అడ్డుగా ద్వేష భావజాలం!

- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ ధ్వజం
- భారతీయ సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు అవగాహన లేదు



గోదావరి పుష్కరాల లోగో

రూపకల్పనకు రూ.లక్ష బహుమతి

- 8 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా..
- 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు పుష్కరాలు..
- 67 ప్రాంతాల్లో ఏర్పాట్లు
- లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పనకు పోటీలు
- తొలి బహుమతి రూ.లక్ష.. రెండో బహుమతి రూ.50 వేలు
- టాప్ 100 మందికి ప్రశంసా పత్రాలు
- పుష్కరాలకు 8 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం
- భక్తుల కోసం 67 ప్రాంతాల గుర్తింపు
- మూడు కేటగిరీలుగా పుష్కర ఘాట్ల విభజన
- మౌలిక వసతుల పనులకు ప్రత్యేక కార్యాచరణ
- ఘాట్ల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల కేటాయింపు

ఏపీ ప్రాజెక్టులకు బీఆర్ఎస్ ముద్ర!

- ఏపీ ప్రాజెక్టులన్నీ బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభం!
- కాంగ్రెస్ వచ్చాక కొత్త ప్రాజెక్టులేవీ లేవు..
- 299 టీఎంసీల కేటాయింపుపై కేసీఆర్ సంతకమే కారణం
- కరువు నివారణకు రూ.30 వేల కోట్ల సాయం కోరాం
- ఎస్ఐఆర్‌పై బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- 'ఇందిరమ్మ సూక్తులు' పుస్తకావిష్కరణ



హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఇటీవల చర్చనీయాంశంగా మారిన పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు సైతం 2022లోనే ప్రారంభమైందని, అప్పుడే జలజీవన్ మిషన్ కింద కేంద్రం రూ.1,580 కోట్ల రుణం మంజూరు చేసిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 299 టీఎంసీల కేటాయింపుపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన సంతకమే కారణమని రేవంత్ విమర్శించారు. ఆ కేటాయింపుల ఆధారంగానే ఏపీలో ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందన్నారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆ ప్రాజెక్టులు ప్రారంభమైనట్లుగా - మిగతా 3లో

భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక చర్చలేవీ జరగలేదు

- ఎస్సీవో వేదికపై కేంద్రం స్పష్టత.. సాధారణ సంభాషణలే జరిగాయని వెల్లడి
- ద్వైపాక్షిక చర్చలపై కేంద్రం స్పష్టత.. పాక్ మంత్రితో సాధారణ సంభాషణలే
- ఇంద్రప్రస్థ కమ్యూనిక్ విడుదల.. వారసత్వ పరిరక్షణకు ఏఐ వినియోగం
- యునెస్కో గుర్తింపునకు ఉమ్మడి నామినేషన్లు.. నాలుగు కీలక అంశాలపై చర్చలు
- ప్రపంచ శాంతికి సంస్కృతి వారధి.. వసుధైవ కుటుంబకానికి ఎస్సీవో మద్దతు..





అగ్నివీరులకు పెళ్లికి

గ్రీన్‌సిగ్నల్

- రెండేళ్ల సర్వీసు పొడిగింపు ఎంచుకునేవారికి అవకాశం..
- నాలుగు వారాల శిక్షణ తర్వాతే అనుమతి
- 75 శాతం మందికి మరో రెండేళ్ల అవకాశం
- నిబంధనల సడలింపుతో ఊరట

కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే రాజకీయాల నుంచి

తప్పుకుంటా!

- 500 రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- 420 హామీలిచ్చి ఒక్కటీ సరిగా అమలు చేయలేదు
- మహిళలను కోటీశ్వరులను చేస్తామన్నారు.. లక్షాధికారులనైనా చేయాలి
- వరంగల్ అభివృద్ధిపై ప్రభుత్వానికి ప్రశ్నలు
- సంక్షేమం సున్నా.. అభివృద్ధి గుండుసున్నా
- సొంత పార్టీ నేతలే అవినీతి ఆరోపణలు చేస్తున్నారు



హనుమకొండ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి చూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ - మిగతా 3లో

వచ్చే ఎన్నికల్లో కోటి ఓట్లు..

90 సీట్లు గెలుస్తాం

- పైరవీలతో పదవులు రావు.. పార్టీ కోసం కష్టపడిన వారికే గుర్తింపు
- గ్రామాలు, గూడేలు, తండాల్లో ప్రజలతో మమేకం కావాలి
- రెండోసారి అధికారంలోకి రావడమే లక్ష్యం
- పైరవీలతో పదవులు రావు
- 90 రోజుల్లో 48 లక్షల సభ్యత్వాలు
- పార్టీ కోసం పనిచేసిన వారికే అవకాశాలు
- నాయకుల పనితీరుపై ప్రత్యేక నిఘా
- నిరాశలో ఉన్న నేతలకు గుర్తింపు
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో నిజాయతీగా పనిచేసిన వారిని వెతుక్కుంటూ పదవులు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో అగ్రనేతల చుట్టూ, గాంధీభవన్ వద్ద తిరిగితే పదవులు రావని స్పష్టం చేశారు. నాయకులు గ్రామాలు, గూడేలు, తండాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి తగిన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోటి ఓట్లతో కాంగ్రెస్ 90 స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడిగా తాను బాధ్యతలు చేపట్టిన సమయంలో కాంగ్రెస్ - మిగతా 3లో



చైనా సరిహద్దు గ్రామాల్లో

పెరిగిన జనాభా

- 40 గ్రామాలకు తిరిగొచ్చిన ప్రజలు.. వలసలకు అడ్డుకట్ట: అమిత్ షా
- అభివృద్ధి సరిహద్దుల నుంచే ప్రారంభం కావాలి
- అరుణాచల్‌కు కేంద్ర నిధులు భారీగా పెంపు

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

- నవంబర్ 27 తర్వాత బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశం
- అల్పపీడనంగా బలపడే సూచనలు
- ఏపీకి ప్రస్తుతానికి తుపాను ముప్పు లేదన్న నిపుణులు
- శ్రీలంక లేదా తమిళనాడు వైపు వెళ్లే అవకాశాలే ఎక్కువ
- తూర్పు గాలులతో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు



గోదావరి పుష్కరాల లోగో రూపకల్పనకు రూ.లక్ష బహుమతి



గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తెలంగాణ దేవాదాయ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పుష్కరాల విశిష్టత, గోదావరి నదీ ప్రాశస్త్యం, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా లోగో, ట్యాగ్‌లైన్ రూపొందించేందుకు పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి కలిగిన డిజైనర్లు, కళాకారులు, విద్యార్థులు, సృజనాత్మకత కలిగిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. తెలుగు, ఇంగ్లీష్ లేదా రెండు భాషల్లోనూ లోగో, ట్యాగ్‌లైన్ రూపొందించి సమర్పించేందుకు అవకాశం కల్పించింది.

విజేతలకు భారీ నగదు బహుమతులు

పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులు అందించనున్నారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు ప్రకటించారు. వీరితోపాటు ఉత్తమంగా ఎంపికైన టాప్ 100 మందికి ధ్రువపత్రాలు అందజేయనున్నారు. లోగోలో గోదావరి నది ప్రాముఖ్యత, పుష్కరాల ఆధ్యాత్మిక నేపథ్యం, సంప్రదాయాలు, భక్తి భావం స్పష్టంగా ప్రతిబింబించాలని సూచించారు. పోటీలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం దేవాదాయ శాఖ వెబ్‌సైట్ endowments.ts.nic.inను సందర్శించాలని అధికారులు సూచించారు.

8 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం

2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సుమారు 8 కోట్ల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని దేవాదాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నద్ధతపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కరాల నిర్వహణకు చేపట్టాల్సిన పనులు, భక్తుల రాకపోకలు, స్నానఘట్టాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

జూన్ 26 నుంచి జులై 7 వరకు

2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు మొత్తం 12 రోజులపాటు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు దేవాదాయ శాఖ ఇప్పటికే కార్యాచరణ రూపొందిస్తోంది. పుష్కరాల నిర్వహణకు సంబంధించి మొత్తం 67 ప్రాంతాలను గుర్తించినట్లు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. భక్తుల రాకపోకలు, ఆయా ప్రాంతాల ప్రాధాన్యత, పుష్కర స్నానాలకు వచ్చే వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకుని మూడు కేటగిరీలుగా విభజించినట్లు వివరించారు.

సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రణాళిక

పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రత వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. స్నానఘట్టాల వద్ద రద్దీ నియంత్రణ, పార్కింగ్, రహదారుల అభివృద్ధి, భక్తుల కోసం విశ్రాంతి ప్రాంతాల ఏర్పాటు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ సంజయ్ జాజూ ఆదేశించారు. ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

ఘాట్ల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు

తెలంగాణలో గోదావరి నది ప్రవహించే జిల్లాలు, ప్రాంతాల్లో పుష్కర ఘాట్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం జిల్లాలతోపాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో స్నానఘట్టాలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించింది. పుష్కరాలకు ముందుగానే పనులన్నీ పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

సమన్వయంతో ఏర్పాట్లు

పుష్కరాల నిర్వహణలో దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఆయా శాఖల మధ్య సమన్వయం, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రభుత్వం భావిస్తోంది. సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కోటి ఓట్లు.. 90 సీట్లు గెలుస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేలు, నాయకులను బలవంతంగా బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి తీసుకెళ్లారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ లేకుండా చేస్తానని అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. ఆ పరిస్థితుల్లో తాను పీసీసీ అధ్యక్షుడిగా డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి, 90 రోజుల్లో దేశంలోనే అత్యధికంగా 48 లక్షల మందిని కాంగ్రెస్ సభ్యులుగా చేర్పించినట్లు తెలిపారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే అవకాశాలు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాల్లో విజయం సాధించిందని, మిత్రపక్షమైన సీపీఐ ఒక స్థానాన్ని గెలుచుకుందని సీఎం గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు 90 లక్షలకు పైగా ఓట్లు రావడంలో కార్యకర్తల కృషి కీలకమని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో జెండా మోసిన నాయకులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చామని చెప్పారు. అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వాకిటి శ్రీహరి, మక్కాన్‌సింగ్, రాజ్ ఠాకూర్ వంటి నాయకులకు పార్టీ అవకాశాలు కల్పించిందని వివరించారు. వారిలో కొందరికి మంత్రి పదవులు కూడా దక్కాయని తెలిపారు.

నాడు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఎమ్మెల్యేగా పోటీ చేయాలని కోరితే, తాను గాంధీభవన్‌లో సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తానని చెప్పారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. అనంతరం ఆయన ఎమ్మెల్సీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఎదిగారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా పార్టీ కోసం నిజాయతీగా పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు.

పార్టీ లైన్‌లో ఉంటే పదవి దానంతట అదే వస్తుంది

కాంగ్రెస్ నాయకుల ప్రవర్తన, మాటతీరును పార్టీ నిశితంగా గమనిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నాయకులు



బయట ఏం మాట్లాడుతున్నారు, అంతర్గతంగా ఎలా వ్యవహరిస్తున్నారనే విషయాలపై పార్టీకి సమాచారం ఉందని చెప్పారు. రాజకీయాల్లో నాయకుల పనితీరుకు ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలే కొలమానమని పేర్కొన్నారు. ఎవరు ఎంత కష్టపడ్డారో ఎన్నికల సమయంలో అంచనా వేస్తామని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తామని, పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించిన వారినీ విస్మరించబోమని హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయని భరోసా ఇచ్చారు.

నిరాశలో ఉన్న నేతలకు గుర్తింపు

ఎన్టీఆర్ హయాం, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలను కొనసాగిస్తూనే, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని సీఎం తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. మంచి పనులను బహిరంగంగా ప్రచారం చేయాలని, లోపాలను అంతర్గతంగా తెలియజేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన పలువురికి అడగకుండానే ఎమ్మెల్సీ పదవులు కల్పించామని చెప్పారు. ఎమ్మెల్యే టికెట్లు దక్కని వారికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని తెలిపారు. నిరాశలో ఉన్న నాయకులకు భవిష్యత్తులో తప్పకుండా గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాహుల్‌గాంధీపై విశ్వాసంతో కాంగ్రెస్‌లో చేరారని, ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్ అసెంబ్లీ టికెట్ విషయంలో సురేశ్ షెట్కార్ తనకు కేటాయించిన బీఫామ్‌ను సంజీవరెడ్డి కోసం వదులుకున్నారని గుర్తుచేశారు. అనంతరం సురేశ్ షెట్కార్‌కు పార్లమెంట్ సభ్యుడిగా అవకాశం కల్పించామని తెలిపారు.

కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి

తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి పదవి గౌరవప్రదమైనదని సీఎం అన్నారు. గతంలో పలువురు ప్రముఖ నాయకులు ఈ బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తిరిగి అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది

బీఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారంతో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకు వస్తానని గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, అక్కడి రాజకీయ పరిస్థితులపై ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఎం వ్యంగ్యంగా మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ సభ్యుల వ్యవహారశైలిపై విమర్శలు చేశారు. గత సమావేశాల్లో వారే తమ నిరసనను ఆ విధంగా వ్యక్తం చేశారని వ్యాఖ్యానించారు.

అర్హతలున్నా.. అభద్రతే!

హైదరాబాద్: రాష్ట్ర ఉన్నత విద్యారంగానికి వెన్నెముకగా నిలుస్తున్న తమకు ఉద్యోగ భద్రత కరువైందని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 నుంచి 25 ఏళ్లుగా రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా బోధన, పరిశోధన, పరిపాలన బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ తమను కాంట్రాక్ట్ విధానంలోనే కొనసాగించడం అన్యాయమంటున్నారు. ఇప్పటికీ తమకు సరైన గుర్తింపు, పనికి తగ్గ వేతనాలు అందడం లేదని 12 వర్సిటీల్లోని 2 వేలకు పైగా కాంట్రాక్ట్ అధ్యాపకులు వాపోతున్నారు. తక్షణమే తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బోధన, పరిశోధనలో కీలక పాత్ర

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లంతా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్దేశించిన విద్యార్హతలు కలిగి ఉన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు బోధనతోపాటు పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనలో మార్గదర్శకత్వం వహిస్తున్నారు. పలువురు పేటెంట్లు సాధించడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రఖ్యాత జర్నళ్లలో పరిశోధనా పత్రాలు ప్రచురించారు. వాటికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించింది. పరీక్షల నిర్వహణ, ఇన్విజిలేషన్, ప్రశ్నపత్రాల రూపకల్పన, మోడరేషన్, థియరీ పేపర్ల మూల్యాంకనం, ప్రాక్టికల్ పరీక్షలు వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ప్లేస్‌మెంట్, మూల్యాంకనాలు, పబ్లిక్ రిలేషన్స్ విభాగాల్లోనూ సేవలందిస్తున్నారు. యూజీ, పీజీ



పాఠ్యపుస్తకాల రూపకల్పన, రచనలో భాగస్వాములవుతున్నారు. యూజీసీ, ఐసీఎస్ఎస్ఆర్, డీబీటీ, డీఎస్టీ వంటి సంస్థల పరిశోధనా ప్రాజెక్టుల్లో కో--ప్రాజెక్ట్ డైరెక్టర్లు, కో--ఇన్వెస్టిగేటర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌ఛార్జి హెచ్ఓడీలుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యులుగా, డిపార్ట్‌మెంట్ కమిటీలు, పరిశోధనా కమిటీల్లోనూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాకే కొత్త నియామకాలు..

ఇంతటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తమకు కనీస వేతనాలు కూడా అందడం లేదని కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే రకమైన పనిని చేస్తున్నప్పుడు సమాన వేతనం చెల్లించాలన్న సుప్రీంకోర్టు సూత్రాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ ఇటీవల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను విశ్వవిద్యాలయ వ్యవస్థలో విలీనం చేయాలని సిఫారసు చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. పంజాబ్, అస్సాం, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను విశ్వవిద్యాలయాల్లో విలీనం చేసి రెగ్యులర్ ఫ్యాకల్టీ హోదా కల్పించిన అంశాన్ని ఉదాహరణగా చూపిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అదే తరహాలో నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. రెగ్యులరైజేషన్ లేదా విలీన ప్రక్రియకు మరింత సమయం పట్టే పక్షంలో తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించి, 2016 నుంచి అమల్లో ఉన్న 7వ యూజీసీ పే కమిషన్ వేతనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కరించిన తర్వాతే కొత్త అధ్యాపక నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏపీ ప్రాజెక్టులకు బీఆర్ఎస్ ముద్ర!



-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. తెలంగాణలో ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం కేసీఆర్ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగలేదని విమర్శించారు.

గాంధీభవన్‌లో కాంగ్రెస్ కీలక భేటీ

ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), సలహా కమిటీ సంయుక్త సమావేశం జరిగింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల నూతన ఇన్‌చార్జి బీఎం సందీప్‌తో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కార్యదర్శులు సచిన్ సావంత్, జెట్టి కుసుమకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు.

కరువు పరిస్థితులపై ఆందోళన

రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. విద్యుత్ డిమాండ్ ఎంతగా ఉన్నప్పటికీ సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆహార ధాన్యాల కొరత లేదని, అయితే ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని రానున్న ఎనిమిది నెలలపాటు ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని చెప్పారు. కరువు పరిస్థితులను అధిగమించేందుకు కేంద్రాన్ని రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం కోరుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేస్తుంటే, బీజేపీ ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. యాంత్రికంగా ఓటర్ల పేర్లను తొలగించడం వల్ల కొందరు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఎన్టీఆర్, వైఎస్సార్ హయాంలో ప్రారంభమైన కొన్ని కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నామని సీఎం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన పార్టీ ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు స్వాగతం పలికిన రేవంత్‌రెడ్డి, గతంలో ఇన్‌చార్జిగా పనిచేసిన మీనాక్షి నటరాజన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఇందిరమ్మ సూక్తులు' పుస్తకావిష్కరణ

మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రచురించిన 'ఇందిరమ్మ సూక్తులు' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు. ఆంగ్లంలో ఉన్న ఇందిరాగాంధీ సూక్తులను డాక్టర్ పొన్నం రవిచంద్ర, డాక్టర్ మామిడి హరికృష్ణ, శ్రీలక్ష్మి తెలుగులోకి అనువదించారు. ఈ కార్యక్రమంలో బీఎం సందీప్, మహేశ్‌కుమార్‌గౌడ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా!

-మొదటిపేజీ తరువాయి

ఆధ్వర్యంలో నిర్వహించిన జన చైతన్య సభలో కేటీఆర్ ప్రసంగించారు.



420 హామీలిచ్చి మోసం చేశారు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని హామీ ఇచ్చారని, కనీసం లక్షాధికారులుగానైనా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు తమ సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ముఖ్యమంత్రి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు.

వరంగల్ అభివృద్ధిపై ప్రశ్నలు

వరంగల్ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద ఆస్పత్రుల్లో ఒకటిగా నిర్మించిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించలేదని విమర్శించారు. వరంగల్‌లో యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తమ హయాంలో నాలుగు ఐటీ కంపెనీలను తీసుకొచ్చామని, కనీసం వెయ్యి ఉద్యోగాల కల్పనకు ప్రయత్నించామని తెలిపారు.

ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి, కమీషన్ల వ్యవహారాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన సాగడం లేదని, పర్సంటేజీల పాలన కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి కుటుంబాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వ నిర్ణయాలపై పలు ఆరోపణలు చేశారు.

ఫ్యూచర్ సిటీపై విమర్శలు

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఫ్యూచర్ సిటీలో భవిష్యత్తు లేదని, వరంగలే భవిష్యత్తు నగరమని వ్యాఖ్యానించారు. వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు.

మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని కేటీఆర్ అన్నారు. మరో 500 రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, 2028లో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి పనులపై ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు.

కేంద్ర పార్టీలపై విమర్శలు

రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకత్వం జాతీయ పార్టీలకు గులాంగిరీ చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. అమిత్‌షా, రాహుల్‌గాంధీలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రయోజనాల కంటే జాతీయ నాయకత్వాల ఆదేశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండూ నిలిచిపోయాయని విమర్శించారు.

పైల్వాన్‌పురంలో ఘనంగా శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవం

విగ్రహ ప్రతిష్ఠాపన, గజస్తంభ నిర్మాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి.



సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 22.యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్‌పురం గ్రామంలో పల్లె వంపు గూడెం వద్ద శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన, గజస్తంభ నిర్మాణ మహోత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ బొక్క పద్మారెడ్డి, వైస్ చైర్మన్ గూడూరు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి, అన్నదాత బొక్క ఝాన్సీ, చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేసినారు. గ్రామ సర్పంచ్ బద్దం కరుణశ్రీ పవన్ కుమార్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆలయ నిర్మాణ దాతలు, గ్రామ పెద్దలు, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను, గ్రామ పెద్దలను, ముఖ్య అతిథులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైడ్ డ్రైన్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మండల కేంద్రంలో అన్ని వసతులు కల్పిస్తా



సికె.న్యూస్. నేరడిగొండ:నెరడిగొండ మండల కేంద్రంలోని విజయ్ రెడ్డి కాలనీలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రూ. 50 లక్షలతో సీసీ సైడ్ డ్రైన్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, త్వరలోనే గ్రావెల్ రహిత గ్రామంగా నెరడిగొండను మార్చుతామన్నారు. ప్రతీ గల్లీలో డ్రైన్లు, సీసీ రోడ్లు పూర్తి చేస్తామన్నారు. 24 గంటలు ఎమ్మెల్యే అందుబాటులో ఉంటాడని ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఎప్పుడైనా తన ఇంటికి రావొచ్చని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, సాబ్లే సంతోష్, సుజీల్, అధికార ప్రతినిధి మొట్టే కిరణ్, అర్షద్ తదితరులు ఉన్నారు.

పల్లె నిద్రలో భాగంగా పలు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్న ఆడే గజేందర్

- పార్డి (కే) గ్రామ పంచాయతీ అభివృద్ధికి రూ.35 లక్షలతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి -- అందరం కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం: ఆడే గజేందర్
- ఇందిరమ్మ జీవిత బీమా పథకం గురించి వివిధ పల్లెల్లో వివరించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



సికె.న్యూస్.బోథ్:సోనాల మండలం పార్డి (కే) గ్రామంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ చేపట్టిన "పల్లె నిద్ర" కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా పార్డి (కే) గ్రామ పంచాయతీలో రాత్రి బస చేసిన ఆయన, ఆదివారం ఉదయం పుణ్యనాయక్ తండా, గొల్లపూర్, మామిడిగూడ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి గ్రామస్తులను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ... పార్డి (కే) గ్రామ పంచాయతీలో ఇప్పటికే సుమారు రూ.35 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరిస్తూ ఐక్యంగా ముందుకు సాగాలని, అందరం కలిసి కట్టుగా పనిచేస్తే గ్రామ పంచాయతీని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు.అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం గురించి గ్రామస్తులకు వివరించి, పథకం యొక్క ప్రయోజనాలు, అర్హతలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్, స్థానిక సర్పంచ్,సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్,బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న,పాక్స్ డైరెక్టర్ లోలపు పోశెట్టి,సోనాల మండల మాజీ అధ్యక్షుడు గుడాల శేఖర్,నాయకులు బొజ్జ సాయన్న,లలూరం,బాశెట్టి
సుదర్శన్,ప్రకాష్,మారుతి,మౌలానా,సురేష్,మహాదు,జలపాత్,యండి సద్దాం,గంగాధర్,బుక రాములు తదితరులు ఉన్నారు

నాయకత్వానికి నిదర్శనం... నిబద్ధతకు ప్రతిరూపం... ఆదిలాబాద్ అభివృద్ధికి ఆశాకిరణం



సికె.న్యూస్ ప్రతినిధి అదిలాబాద్:జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ నరేష్ జాదవ్ గారు బాధ్యతలు స్వీకరించి ఒక సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు.నాయకత్వం అంటే కేవలం పదవిని చేపట్టడం కాదు... బాధ్యతను భుజాన వేసుకోవడం, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, కార్యకర్తలకు అండగా నిలవడం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వంతో పోరాడి హక్కులను సాధించడం. అలాంటి నమ్మకమైన నాయకత్వం, నాణ్యమైన రాజకీయ పరిణతి, దూరదృష్టితో కూడిన విజన్, ఉన్నత విద్య, రాజకీయ నిబద్ధత కలగలిసిన నాయకుడు డాక్టర్ నరేష్ జాదవ్ గారు.ఎన్నో ఏళ్లుగా రాజకీయంగా, అభివృద్ధిపరంగా తగిన గుర్తింపునకు నోచుకోని ఆదిలాబాద్ జిల్లాకు జిల్లా కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఆయన చేసిన కృషి అభినందనీయం.

రాహుల్ గాంధీ గారి స్ఫూర్తి... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్... ప్రజల ఆకాంక్షే లక్ష్యం... ఈ మూడింటినీ ఏకకాలంలో సమన్వయం చేసుకుంటూ, మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఆచరణలో నిరూపిస్తున్న నాయకుడు డాక్టర్ నరేష్ జాదవ్

బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదిలోనే సాధించిన ముఖ్యమైన విజయాలు ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనాలు.

కాంగ్రెస్ పార్టీకి సొంత కార్యాలయం: జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఒక ఎకరం భూమిని సాధించడం ద్వారా పార్టీకి శాశ్వత సంస్థాగత పునాదిని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు.

2. ఇందిరమ్మ ఇళ్ల సాధన: రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ఆదిలాబాద్ జిల్లాకు అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేసి పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కలకు బాటలు వేశారు.

3. కుప్టీ రిజర్వాయర్:లి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి జీవనాధారంగా నిలిచే కుప్టీ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 6.3 టీఎంసీలకు సాధించడంతో పాటు, మూడు ప్రత్యేక లిఫ్టులకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన జీవోల్లో మార్పులు చేయించేందుకు కృషి చేయడం ఆయన దూరదృష్టికి నిదర్శనం.

4. విద్యారంగ అభివృద్ధి: ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల ఆవశ్యకతను ప్రభుత్వానికి బలంగా వివరించి, ఉన్నత విద్యావకాశాల కల్పనకు మార్గం సుగమం చేయడంలో చొరవ చూపారు.

5. చనాకా--కొరాటా ప్రాజెక్టు:ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పటికీ, ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చేసిన కృషి రైతాంగ ప్రయోజనాల పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తుంది.

ఇవి కేవలం రాజకీయ విజయాలు మాత్రమే కాద ఆదిలాబాద్ జిల్లా భవిష్యత్తుకు సంబంధించిన అభివృద్ధి ప్రస్థానంలో వేసిన కీలక అడుగులు.

28 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రయాణం... ఎన్నో అనుభవాలు... ఎన్నో ఒడిదుడుకులు... ఎన్నో పోరాటాలు

ఈ ప్రయాణంలో పదవుల కంటే విలువలకు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలకు, స్వార్థ రాజకీయాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వడం డాక్టర్ నరేష్ జాదవ్ గారి రాజకీయ వ్యక్తిత్వంలో ప్రత్యేకత.ముక్కుసూటితనం, మాటలో స్పష్టత, నిర్ణయాల్లో నిబద్ధత, రాజకీయాల్లో విలువలు, కార్యకర్తల పట్ల ఆత్మీయత ఆయన నాయకత్వానికి బలమైన పునాదులు. కార్యకర్తల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ, వారి రాజకీయ ఎదుగుదలకు మార్గదర్శకంగా నిలుస్తూ, ఆదిలాబాద్ జిల్లా హక్కులు, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించడం ఆయనలోని నాయకత్వ లక్షణాలకు నిదర్శనం.ఒక నాయకుడి గొప్పతనం ఆయన వెనుక ఎంతమంది ఉన్నారనే దానిలో కాదు... ఆయన వల్ల ఎంతమంది నాయకులుగా ఎదిగారనే దానిలో ఉంటుంది. కార్యకర్తలను కేవలం అనుచరులుగా కాకుండా, భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దే రాజకీయ సంస్కృతి అలవర్చడం నిజమైన నాయకత్వానికి నిదర్శనం.

జిల్లా అధ్యక్షుడిగా మొదటి సంవత్సరం ఒక ఆరంభం మాత్రమే... భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాం.

నేడు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేస్తూ, రేపు చట్టసభల్లో ఆదిలాబాద్ జిల్లా ప్రజల గొంతుకగా నిలిచి, జిల్లా సమస్యలను శాసనసభలో వినిపించే స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బలోపేతం, కార్యకర్తల రాజకీయ భవిష్యత్తు అనే మూడు లక్ష్యాలతో మీ ప్రస్థానం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ...

డాక్టర్ నరేష్ జాదవ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ శ్రేణుల తరఫున జిల్లా అధ్యక్షుడిగా ఒక సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు.

నాయకత్వం పదవితో రాదు... నిబద్ధతతో నిలబడుతుంది. చరిత్రలో నిలిచేది పదవి కాదు... ప్రజల కోసం సాధించిన విజయాలు!

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు
- పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు, తక్కువ వడ్డీకే రుణాలు అంటూ సైబర్ మోసాలు
- వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో రెండు వేర్వేరు సైబర్ మోసాల కేసులు నమోదు, బాధితులకు ఉపశమనం..
- మొదటి కేసులో రూ.50 వేలు, రెండో కేసులో దాదాపు రూ.2 లక్షలు బ్లాక్
- వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్.



సికె.న్యూస్..ఆదిలాబాద్:సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ సూచించారు. సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర వాటిలో వచ్చే ప్రకటనలను పూర్తిగా పరిశీలించకుండా నమ్మి డబ్బులు చెల్లించవద్దని తెలిపారు.ఇటీవల ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు సైబర్ మోసాల ఘటనలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.మొదటి ఘటనలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రకటనలో ూఇఇవశ్రీ ఎఱ్ఱుఎఅఅస్త్ర జశీఎజుఝఅఎలో పెట్టుబడి పెడితే వారం రోజుల్లో డబ్బులు రెట్టింపు అవుతాయని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. పట్టణానికి చెందిన బాధితురాలిని టెలిగ్రామ్ ఛానల్‌లో చేర్చుకుని, బంగారం, వెండి, పెట్రోల్, డీజిల్ వ్యాపారాల్లో పెట్టుబడుల పేరుతో విడతల వారీగా మొత్తం రూ.3,47,543 బదిలీ చేయించుకున్నారు. అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వకుండా మరిన్ని డిపాజిట్లు చేయాలని ఒత్తిడి చేయడంతో మోసపోయినట్లు గుర్తించి 1930కు ఫిర్యాదు చేశారు. ఈ కేసు నందు బాధితురాలు మోసపోయిన డబ్బులోని రెండు లక్షల రూపాయలను ఫిర్యాదు ద్వారా బ్లాక్ చేయడం జరిగిందని తెలిపారు.రెండో ఘటనలో ఇన్‌స్టాగ్రామ్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్ పేరుతో వ్యక్తిగత రుణం ఇప్పిస్తామని ప్రకటన ఇచ్చి సైబర్ నేరగాళ్లు బాధితురాలిని సంప్రదించారు. రూ.5 లక్షల రుణం మంజూరు చేస్తామని నమ్మించి ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్, ట్యాక్స్, ఎన్ఓసీ తదితర ఛార్జీల పేరుతో 16 విడతల్లో మొత్తం రూ.1,95,006 వసూలు చేశారు. అయినప్పటికీ రుణం మంజూరు చేయకుండా మరిన్ని డబ్బులు చెల్లించాలని కోరడంతో బాధితురాలు సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి 1930కు ఫిర్యాదు చేశారు. ఈ కేసు నందు బాధితురాలు మోసపోయిన డబ్బులు 50వేల రూపాయలను బ్లాక్ చేయడం జరిగిందని తెలిపారు.ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ వంటి వివిధ పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని, ఎలాంటి హామీలు లేకుండా రుణాలు ఇస్తామని చెప్పే ప్రకటనలను నమ్మవద్దని సూచించారు. తెలియని వ్యక్తులు పంపే లింకులను ఓపెన్ చేయవద్దని, గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని వెల్లడించవద్దని సూచించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని లేద వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. ప్రజల అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ పేర్కొన్నారు.

ధ్వజస్తంభ,నవగ్రహ పున ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి



బాసు హనుమంతు నాయుడు

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు గద్వాల నియోజకవర్గం కేటి దొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో పాగుంట శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో నూతన అలువేల్మంగా నాయకి సమేత దశావతార మరియు ధ్వజస్తంభ,నవగ్రహా పునః ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని, కొబ్బరికాయ కొట్టి,ప్రత్యేక పూజలు నిర్వహించారు.... ముందుగా,శ్రీశ్రీశ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను పొందారు....

అనంతరం,బాసు హనుమంతు నాయుడు ని వేద పండితులు & పార్టీ శ్రేణులు శాలువలతో ఘనంగా సత్కరించారు.....

అంతక ముందు,బాసు హనుమంతు నాయుడు ని గ్రామ పార్టీ నాయకులు,కార్యకర్తలు, డోలు మేళాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు...ఈ సందర్భంగా,బి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో గద్వాల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో, సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.....ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, బీచుపల్లి,పటేల్ జనార్దన్ రెడ్డి,ఆంజనేయులు,సోమశేఖర్ రెడ్డి,చక్రిధర్ రెడ్డి,మహాదేవప్ప,జాంపల్లి భరత్ సింహారెడ్డి,శ్రీరాములు,నక్క రవి, కావలి గోపి,నరసింహులు,గోవిందు, మున్నూరు వీరా రెడ్డి,రఘు నాయుడు,సుభాష్ రంగారెడ్డి, వెంకటేష్ యాదవ్,రాము,గోనేల స్వామి,యోగేంద్ర,ప్రహ్లాద్,అంజి, జంగిలప్ప, అంపన్న, లక్ష్మన్న, హనుమంతు, ఆంజనేయులు, రవి, పరశురాముడు, రంగస్వామి, తిమ్మప్ప, వీరేష్, రామాంజనేయులు, నరసింహులు, శంకర్, మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.....

ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలి -- జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఆరోగ్య జాతరలో భాగంగా 234 పాఠశాలల్లో విద్యార్థులతో జల సంరక్షణ ప్రతిజ్ఞ
- నీటి వృథాను అరికట్టి, భావితరాలకు జల సంపదను అందించాలి -- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్ నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద అని, ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాలంటే ఇప్పటి నుంచే నీటి పొదుపును ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్య పాఠశాలలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న ఆరోగ్య జాతర కార్యక్రమంలో భాగంగా నవంబర్ 21న జిల్లాలోని 234 పాఠశాలల్లో విద్యార్థులతో జల సంరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 102 ప్రాథమికోన్నత పాఠశాలలు, 18 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), 6 మోడల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని నీటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే వినియోగిస్తామని, కుళాయిలను అనవసరంగా తెరిచి ఉంచబోమని, నీటి లీకేజీలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేశారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతల ఏర్పాటును ప్రోత్సహించడం, నీటి పొదుపు ఆవశ్యకతను కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల ప్రజలకు వివరించడం ద్వారా జల సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆరోగ్య జాతరలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మక అనుభవాల ద్వారా నీటి ప్రాధాన్యతను తెలియజేశారు. ప్రతి ఇంట్లో, పాఠశాలలో నీటి పొదుపు అలవాట్లను పాటించడంతో పాటు సమాజంలోనూ జల సంరక్షణపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. పెరుగుతున్న జనాభా, నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి వృథా నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో పాటు ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని, ప్రతి పౌరుడు నీటిని వృథా చేయబోమని ప్రతిజ్ఞ చేయాలని పేర్కొన్నారు. 'నీటిని సంరక్షిద్దాం -- జీవాన్ని కాపాడుకుందాం' అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, ప్రతి నీటి బొట్టును కాపాడటం ద్వారా భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందిద్దామని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఘనంగా శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్నదాన కార్యక్రమం
- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఘన సన్మానం



సి.కె. న్యూస్ -- వలిగొండ మండల ప్రతినిధి బాలరాజు । నవంబర్ 22: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలో కొలువై ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల గోవింద నామస్మరణలు, స్వామివారి నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు తుమ్మల కరుణాకర్ రెడ్డి, దామోదర్, అనంతాచారి, కంబాలపల్లి అండాలు, కొత్త జంగయ్య, ఆవుల చంద్రకళ, రాధారపు రమేష్, బట్టు నరసింహ, మీసాల ముత్యాలు, కేశిరెడ్డి నరేందర్ రెడ్డి, కూర వెంకటేశం, ఎస్. నరసింహ, గురుకుల కుమార్ గౌడ్, బొడిగ వెంకటేశం, ప్రతాపురం శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు సింహాద్రి హాస్పిటల్ యాజమాన్యం, హయత్‌నగర్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఆలయ పాలకమండలి సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానం దేవస్థానం సిబ్బంది ఈవో పాల్గొన్నారు

మారుమూల గ్రామం నుండి తెలంగాణ హైకోర్టు న్యాయవాదిగా..

- స్ఫూర్తిదాయక విజయం సాధించిన నీరుడి ప్రశాంత్



సి కె న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి కుల్చారం / మెదక్ జిల్లా: కఠోర శ్రమ, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించారు మెదక్ జిల్లా, కుల్చారం మండలం, వరిగుంతం గ్రామానికి చెందిన నీరుడి ప్రశాంత్. ఒక మారుమూల గ్రామం నుండి వచ్చిన ఆయన, ఎంతో ఘన చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీ నుండి న్యాయశాస్త్ర పట్టా (ఎల్.ఎల్.బి) పొందారు. తాజాగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమైన తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా (అడ్వకేట్)ప్రమాణ స్వీకారం చేసి తన కలను సాకారం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ..

తన సొంత గ్రామమైన వరిగుంతం గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో పదవ తరగతి వరకు చదివి ఇంటర్ కొల్చారంలో చదివానన్నాడు తర్వాత డిగ్రీ విద్యాభ్యాసం కొరకు సిద్దిపేటలోని ఎస్ఎంహెచ్ (గ్రామీణ) (ఎస్ఎంహెచ్ఎం.) కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి నా తర్వాత న్యాయవిద్య వైపు అడుగు లేసానని చెప్పాడు"ఒక మారుమూల గ్రామం నుండి వచ్చి ఉస్మానియా లా కాలేజీలో చదవడం, నేడు ప్రతిష్టాత్మకమైన తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణం చేయడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. నన్ను ప్రోత్సహించిన నా తల్లిదండ్రులకు, గురువులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. సామాన్య ప్రజలకు, పేదలకు న్యాయం అందించడమే నా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. ఒక మారుమూల పల్లె నుండి హైకోర్టు స్థాయికి ఎదిగిన ప్రశాంత్‌ను వరిగుంతం గ్రామస్తులు, కుల్చారం మండల ప్రజలు, మిత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

ముంగి వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్



గరిడేపల్లి సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు మండల పరిధిలో ఉన్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముంగి అచ్చయ్య వారి కుటుంబంలో జరిగిన వివాహమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్ సింగల్ విండో చైర్మన్ వీరం రెడ్డి శశీబిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు అదేవిధంగా వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు కార్యక్రమంలో పాల్గొని ఆ కుటుంబ సభ్యులతో విందు భోజనం చేసి వారిని ఆనందింప చేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటరమణారెడ్డి వై వి రెడ్డి జాగృతి నాయకులు గోవర్ధన్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోత్ సందీప్ నాయక్ స్థానిక నాయకులు నూతన వధూవరుల తల్లిదండ్రులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

జింకలపల్లి స్టేజీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం!

విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ దుర్మరణం.. సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచిన భీముడు



జోగులాంబ గద్వాల జిల్లా, నవంబర్ 22: ఇటిక్యాల మండలం జింకలపల్లి స్టేజీ సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ యువకుడు మృత్యువాత పడటంతో విషాదం నెలకొంది. అప్పటివరకు విధుల్లో కొనసాగుతున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. మల్దకల్ మండల కేంద్రానికి చెందిన ఉప్పరి మల్లేశ్ కుమారుడు భీముడు జింకలపల్లి స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం. మృతుడు ఎర్రవల్లి పదో బెటాలియన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అయితే ప్రమాదం ఏ విధంగా జరిగింది? ఏ వాహనం ఢీకొట్టింది? ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికావాల్సి ఉంది.

కుటుంబంలో విషాదఛాయలు

కుటుంబానికి అండగా నిలుస్తూ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న భీముడు అకాల మరణవార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. యువకుడి మృతితో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది.

రోడ్డు ప్రమాదాల పట్ల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

సర్వారం సహకార సంఘంను మూడు భాగాలుగా విభజించాలి

బిఆర్ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోతుసందీప్ నాయక్



గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన సొసైటీలను ఏర్పాటు చేసిన సందర్భంగా మండల కేంద్రంలో సబ్ కేంద్రంగా ఉన్న సర్వారం సహకార సంఘం సొసైటీను మూడు భాగాలుగా విభజించాలని బిఆర్ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోతు సందీప్ నాయక్ అన్నారు సర్వార సహకార సంఘం మరియు పాత సొసైటీ కల్మలచెరువును గరిడేపల్లి ను మూడు భాగాలుగా విభజించాలని వారు కోరారు సర్వార సహకార సంఘం కింద 26 గ్రామాలు 12 గ్రామపంచాయతీలు ఉన్నాయని సంఘం లావాదేవీలు మరియు ఎరువుల పంపిణీ అన్ని గ్రామాల ప్రజలకు సకాలంలో అందటం లేదని తక్షణమే సర్వారం సొసైటీను మూడు భాగాలుగా విభజించి సంఘం అభివృద్ధి కొరకు రైతుల సౌలభ్యం కొరకు సహకరించాలని వారు కోరారు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో తక్షణమే సర్వారం సొసైటీను మూడు భాగాలు విభజించి ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని వారు అన్నారు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక మాసం వనభోజనాలు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి. చింతకాని: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాసం వనభోజనాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్ గౌడ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగమణి వెంకటనారాయణ హాజరయ్యారు. సభకు తేలుకుంట్ల శీను అధ్యక్షత వహించగా, ప్రజా ప్రతినిధి కూరపాటి కిషోర్ , కేబుల్ ఆపరేటర్ కీ జిల్లా అధ్యక్షులు కన్నెబోయిన సీతారామయ్యతో పాటు పలువురు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్తీక మాసం వనభోజనాలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సంఘం సభ్యుల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని చాటిచెప్పే కార్యక్రమాలని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.

కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావం:

- వరి వద్దు అంటున్న ప్రభుత్వం,
- వరి సాగు వైపే మొగ్గు చూపుతున్న ఆడ మగ విత్తన శుద్ధి కంపెనీలు,
- రైతు పంట ఎండితే బాధ్యత ఎవరిది,



(సీ కే న్యూస్) మెదక్, ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది మెదక్ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, అందుకే రైతులు వరి సాగు చేయవద్దని ప్రభుత్వం సూచిస్తోంది. వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయినా మెదక్ జిల్లా రైతులు మాత్రం వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. వరి పండితేనే గిట్టుబాటు ధర వస్తుందని, ఇతర పంటలకు మార్కెట్ సదుపాయం లేదని రైతులు అంటున్నారు. మరోవైపు ప్రైవేట్ ఆడ మగ విత్తనల కంపెనీల యాజమాన్యం, కూడా వరి విత్తనాల విక్రయాలపైనే దృష్టి పెట్టడం, రైతులను వరి వైపు ప్రోత్సహించడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం వద్దు అంటున్నా, కంపెనీలు వరి విత్తనాలను పెద్ద ఎత్తున మెదక్ జిల్లాలో ఆయా మండలలో ప్రవేట్ కంపెనీ యాజమాన్యం ఆడ మగ వరి సాగు పంటల వైపు రైతులను ప్రోత్సహించడం జరుగుతుంది, రైతులు అయోమయంలో పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేట్ ఆడ మగ కంపెనీ యాజమాన్యానికి, వరి సాగుపై మొగ్గు చూపకుండా కంపెనీ యాజమాన్యానికి చురుకలు వెయ్యాలి వరికి దూరంగా ఉండాలని ప్రవేట్ కంపెనీ యజమాన్యాలతో మాట్లాడి రైతులను మభ్య పెట్టకుండా చూడాలి, మెదక్ రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

ఐఓసీ ప్రార్థనా మందిర అభివృద్ధికి,

ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఆర్థిక సాయం,



సీ కే న్యూస్ చేగుంట / చేగుంట పట్టణంలోని ఐఓసీ ప్రార్థనా మందిర సంఘ సభ్యులు అవసరాల నిమిత్తం చేగుంట ఉప సర్పంచ్ రఫిక్ ఆర్థిక సాయం కోరగా వెంటనే ఉప సర్పంచ్ స్పందించి వారి ప్రార్థన మందిరానికి ఆర్థిక సహాయం అందజేశారు, ఆదివారం ప్రార్థనా మందిరంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రభుదాస్ ఉప సర్పంచ్ రఫిక్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రఫిక్ మాట్లాడుతూ ప్రజల మధ్య అన్నదమ్ముల మధ్య తండ్రి కొడుకుల మధ్య ప్రేమానురాగాలు పెంపొంది అందరూ బాగుండాలని కోరారు. వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని పంటలు పండితే అందరూ బాగుండాలని ఆయన తెలిపారు. యేసయ్య దయవల్ల ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో మంచి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని రఫీ తెలిపారు. ప్రార్థనా మందిర అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు సుధాకర్, మోహన్, డాక్టర్ ప్రభుదాస్, లక్ష్మణ్, జాన్, సైమన్, తో పాటు యూత్ సభ్యులు మధు, ప్రభు, ప్రశాంత్, ప్రేమ్, జోయల్, అభిలాష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో కృష్ణమధిర స్విమ్మర్స్ & డ్రీమర్స్ స్విమ్మర్స్ వన సమారాధనకు హాజరైన మధిర స్విమ్మర్స్



మధిర నవంబర్ 22(సికె న్యూస్)కార్తీక మాస సందర్భంగా జగ్గయ్యపేట స్విమ్మర్స్ ఆత్మీయ సమ్మేళనానికి మధిర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి మరియు సభ్యులు కలిసి జగ్గయ్యపేట మామిడి తోటలో జరిగిన కార్తీక మన సమారాధన కార్యక్రమానికి హాజరైనారుఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కృష్ణ సిమ్మర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మోటపోతుల కిషోర్ బాబు (డి.ఎస్.పి) మరియు కృష్ణా స్వి మ్మర్స్ అధ్యక్షులు పిన్నెల్లి పాండురంగారావు డ్రీమర్స్ అధ్యక్షులు పొట్ట బత్తిన పాండురంగారావు తదితరులు మధిర స్విమ్మింగ్ మిత్రులందరికీ సాదరంగా ఆహ్వానించి ఎల్లప్పుడు మధిర జగ్గయ్యపేట నల్లగొండ మిత్రులు కలిసి జరుపుకునే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సభ్యులందరికీ ధన్యవాదములు తెలిపినారుఈ సందర్భంగా బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి (మాటూరు పి .డి) లింగంపల్లి అప్పారావు (రిటైర్డ్ హెడ్మాస్టర్) మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరుపుకునే వన సమారాధనకు కుటుంబ సభ్యుల లాగా కలిసి స్విమ్మర్స్ కుటుంబం లా కలిసిమెలిసి సహపంక్తి భోజనాలు చేయడం కులమతాలకు అతీతంగా పాల్గొనడం ఆనందంగా ఉంది అని పేర్కొ న్నారు

ఈ సందర్భంగా కల్చరల్ ప్రోగ్రామ్స్ లో మహిళా స్విమ్మింగ్ సభ్యులు అత్యధికంగాపాల్గొన్నారు మధిర స్విమ్మింగ్ సభ్యులు చెరుకూరీ కృష్ణారావు చెరుకూరి రమేష్ వెలివేల శ్రీధర్ ఊటుకూరు భాస్కరరావు శీలం శ్రీనివాసరెడ్డి శాఖమూడి బ్రహ్మయ్య మార్తా శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొనటం మాకు చాలా ఆనందదాయకంగా ఉందని ప్రతి సంవత్సరం కార్తీక వన సమారాధన కార్యక్రమాలు జరుపుతుంటే స్నేహభావం స్విమ్మింగ్ సభ్యుల మధ్య మన కుటుంబం అనే భావన కలుగుతుంది అని అన్నారు

మధిరలో నేడు ఆర్యవైశ్య వన సమారాధన.

- నేడు ఆత్కూరు అబ్బూరి వారి మామిడి తోటలో ఆత్మీయ వనభోజనాల వేడుక.
- 3 వేల మందికి పైగా ఆర్యవైశ్యుల రాక.
- ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి



మధిర నవంబర్ 22(సికె న్యూస్)మధిర శ్రీ వాసవి ఆర్యవైశ్య వన సమారాధన కమిటీ ఆధ్వర్యంలో నేడు ఆదివారం ఆత్కూరులోని అబ్బూరి వారి మామిడి తోటలో నిర్వహించనున్న ఆర్యవైశ్య వన సమారాధనకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. మధిర పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 3 వేల మందికి పైగా ఆర్యవైశ్యులు ఈ వేడుకకు హాజరుకానుండటంతో కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.ఆర్యవైశ్య కుటుంబాలన్నీ ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయతలు పంచుకునేలా ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.భక్తుల సౌకర్యార్థం మధిర నుంచి ఆత్కూరుకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. వన సమారాధనలో భాగంగా భక్తిశ్రద్ధలతో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా,ఆర్యవైశ్య అయ్యప్ప స్వాములకు సద్ది కార్యక్రమాన్నిఏర్పాటుచేశారు.వీటితో పాటు కుటుంబ సభ్యులు, చిన్నారులు,యువత ఉత్సాహంగా పాల్గొనేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.ఆధ్యాత్మికత,ఆత్మీయత, ఆనందం కలగలిసిన ఈ వన సమారాధన ఆర్యవైశ్యుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ పండుగ వాతావరణంలో నేటి వనభోజనాల కార్యక్రమం కనుల పండువగా సాగనున్న ది.

సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెరుకూరి నాగార్జున, లక్ష్మి ల కుమార్తె త్రివేణి ఆశీర్వదించిన వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు



మధిర నవంబర్ 22(సికె న్యూస్). మధిర లోని కాంగ్రెస్ నాయకుడు నాగార్జున స్వగృహానికి చేరుకొని వధువు ను ఆశీర్వదించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ...

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తలుపులు వెంకటేశ్వర్లు, పైడిపల్లి కిషోర్ మొండితోక సుధాకర్, మాదల రామారావు, జహంగీర్, కర్లపూడి వాసు, పత్తేపురం సంగయ్య, సాలిక సురేష్ దోర్నాల సంతోష్, తెలుగుదేశం పార్టీ నాయకులు గడ్డం రమేష్ టిఆర్ఎస్ నాయకులు పల్లపోతుల వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నవంబర్ 25 నుంచి ఖమ్మం జిల్లాలో ఆగ్రిగోల్డ్ బాండ్ల ధృవీకరణ, నమోదు ప్రక్రియ ప్రారంభం: పోలీస్ కమిషనర్ సునీల్ దత్



సి కే న్యూస్ ఖమ్మం.ఖమ్మం:ఆగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులకు ఉపశమనం కల్పించి న్యాయం జరిగేలా చూడాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులు మరియు ఏజెంట్ల వద్ద ఉన్న అసలు ఆగ్రిగోల్డ్ బాండ్లు, నగదు రసీదుల ధృవీకరణ మరియు వివరాల నమోదు కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.

ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా పరిధిలోని బాధితులు, డిపాజిటర్లు, ఏజెంట్ల సౌకర్యార్థం సుగ్గలవారి తోట లోని ఖమ్మం సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్క్వార్టర్స్‌లో ఉన్న సిటీ ట్రైనింగ్ సెంటర్ (ఓల్డ్ సీ.పి ఆఫీస్) నందు ప్రత్యేక ధృవీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు.

ఈ కేంద్రం 25.11.2026 నుంచి అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమీషనర్ శ్రీ సునీల్ దత్ మాట్లాడుతూ, ఆగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక ధృవీకరణ కేంద్రాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిపాజిటర్లు, బాధితులు మరియు ఏజెంట్లు నిర్ణీత తేదీ నుంచి తమకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం కేంద్రానికి హాజరై, అవసరమైన పత్రాలతో బాండ్ల ధృవీకరణ మరియు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ధృవీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సూచించిన పత్రాలన్నింటినీ ముందుగానే సిద్ధం చేసుకోవాలని, అసలు బాండ్లను కేవలం పరిశీలన కోసం మాత్రమే చూపించాలని, వాటిని అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బాధితులు ఈ ప్రక్రియపై ఎలాంటి అపోహలకు గురికాకుండా, అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ధృవీకరణ కేంద్రం వివరాలు

- కేంద్రం: ఖమ్మం పట్టణం
- పరిధి: ఖమ్మం జిల్లా
- కేంద్రం చిరునామా: ఖమ్మం సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్క్వార్టర్స్‌లో ఉన్న సిటీ ట్రైనింగ్ సెంటర్ (ఓల్డ్ సీ.పి ఆఫీస్)
- కేంద్రం ఇన్‌చార్జ్: ఎం. డి. సర్వర్, ఏ.సీ.పి, ఖమ్మం సీ.సీ.ఎస్.
- సంప్రదించవలసిన ఫోన్ నెంబర్:
- శ్రీ ఎం.డి సర్వర్, ఏ.సీ.పి, సీ. సీ.ఎస్, 8712659185
- శ్రీ ఎస్.రాజ్ కుమార్ గౌడ్, ఇన్స్పెక్టర్, సీ. సీ.ఎస్, 8712659186
- శ్రీ నాగుల్ మీరా, ఆర్.ఐ, 8712575166, 9848586894
- శ్రీ రణధీర్, ఎస్.ఐ, సి. ఐ.డి, 8712593269

ధృవీకరణకు తీసుకురావాల్సిన పత్రాలు

1. డిపాజిటర్ జీవించి ఉన్నట్లయితే
1. అసలు ఆగ్రిగోల్డ్ బాండ్ / నగదు రసీదు (ధృవీకరణ కోసం తప్పనిసరిగా చూపించాలి).
2. అసలు బాండ్‌కు సంబంధించిన సెల్ఫ్ అటెస్టెడ్ కలర్ జిరాక్స్.
3. ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు జిరాక్స్.
4. పాన్ కార్డు జిరాక్స్.
5. బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ (ఖాతాదారుని పేరు, ఖాతా నంబర్, ×ఖీూజ కోడ్ స్పష్టంగా ఉండాలి).
6. తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటో.
7. డిపాజిటర్ మొబైల్ నంబర్.
8. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్.
9. ఏజెంట్ పేరు, మొబైల్ నంబర్ (తెలిస్తే).

డిపాజిటర్ మరణించి, నామినీ జీవించి ఉన్నట్లయితే

1. అసలు బాండ్ (ధృవీకరణ కోసం చూపించాలి).
2. అసలు బాండ్ కలర్ జిరాక్స్ (నామినీ సంతకంతో).
3. డిపాజిటర్ మరణ ధృవీకరణ పత్రం జిరాక్స్.
4. నామినీ ఆధార్, పాన్ కార్డుల జిరాక్స్.
5. రేషన్ కార్డు / కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం.
6. నామినీ బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్.
7. నామినీ తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటో.
8. నామినీ బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్.
9. ఏజెంట్ వివరాలు (తెలిస్తే).

డిపాజిటర్ మరియు నామినీ ఇద్దరూ మరణించినట్లయితే

1. అసలు బాండ్ (ధృవీకరణ కోసం చూపించాలి).
2. బాండ్ కలర్ జిరాక్స్ (చట్టబద్ధ వారసుడు / కుటుంబ సభ్యుని సంతకంతో).
3. డిపాజిటర్, నామినీ ఇద్దరి మరణ ధృవీకరణ పత్రాలు (అసలు చూపించి జిరాక్స్ సమర్పించాలి).
4. చట్టబద్ధ వారసుని ఆధార్, పాన్ కార్డులు (అసలు చూపించి జిరాక్స్ సమర్పించాలి).
5. రేషన్ కార్డు / కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం (అసలు చూపించి జిరాక్స్ సమర్పించాలి).
6. చట్టబద్ధ వారసుని బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్.
7. తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటో.
8. బ్యాంక్ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్.
9. ఏజెంట్ వివరాలు (తెలిస్తే).

డిపాజిటర్ జీవించి ఉండి, ధృవీకరణ కేంద్రానికి స్వయంగా రాలేని సందర్భంలో

1. డిపాజిటర్ అసలు బాండ్ మరియు సంతకం చేసిన కలర్ జిరాక్స్.
2. డిపాజిటర్ ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్, ఫోటో (అసలు చూపించి జిరాక్స్ సమర్పించాలి).
3. హాజరయ్యే కుటుంబ సభ్యుని ఆధార్ / గుర్తింపు కార్డు (అసలు చూపించి జిరాక్స్ సమర్పించాలి).
4. కుటుంబ సంబంధాన్ని నిరూపించే పత్రం / ధృవీకరణ పత్రం జిరాక్స్.
5. రేషన్ కార్డు లేదా కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం ద్వారా డిపాజిటర్‌తో సంబంధాన్ని నిర్ధారించాలి.
6. డిపాజిటర్ మొబైల్ నంబర్.
7. డిపాజిటర్ నుంచి జారీ చేసిన అధికార పత్రం (ూబ్‌ష్ట్రశీతీఅఓఖ్అశీఅ ూవ్‌వతీ).

ఏజెంట్ల ద్వారా బాండ్ల సమర్పణ విధానం

1. ప్రతి అసలు బాండ్‌ను ధృవీకరణ కోసం చూపించి, దాని కలర్ జిరాక్స్ సమర్పించాలి.
2. ప్రతి బాండ్ గుర్తింపు సంఖ్యను విడివిడిగా నమోదు చేయాలి.
3. ఏజెంట్ ఆధార్, పాన్ కార్డుల జిరాక్స్ సమర్పించాలి.
4. ఏజెంట్ బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్ సమర్పించాలి.
5. ఏజెంట్ తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబర్ ఇవ్వాలి.
6. ఏజెంట్ కోడ్ తప్పనిసరిగా పేర్కొనాలి.
7. సమర్పించిన బాండ్ల సంఖ్యను లెక్కించి రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుంది.

ముఖ్యమైన సూచనలు

- అసలు ఆగ్రిగోల్డ్ బాండ్‌ను కేవలం ధృవీకరణ కోసం మాత్రమే చూపించాలి. అసలు బాండ్‌ను అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదు.
- బాండ్ కలర్ జిరాక్స్‌పై సంబంధిత డిపాజిటర్ / నామినీ / చట్టబద్ధ వారసుడు సంతకం చేసి సమర్పించాలి.
- కలర్ జిరాక్స్‌లో బాండ్ నంబర్‌తో సహా అన్ని వివరాలు స్పష్టంగా కనిపించాలి.
- బ్యాంక్ పాస్‌బుక్‌లో ఖాతాదారుని పేరు, ఖాతా నంబర్, ×ఖీూజ కోడ్ స్పష్టంగా ఉండాలి. సమర్పించే బ్యాంక్ ఖాతాకు మొబైల్ నంబర్ లింక్ అయి ఉండాలి.
- ఏజెంట్ వివరాలు తెలియని పక్షంలో దరఖాస్తులో 'తెలియదు / అందుబాటులో లేదు' అని పేర్కొనవచ్చు.
- డిపాజిటర్ / కుటుంబ సభ్యుడు / ఏజెంట్‌కు సంబంధించిన మొబైల్ నంబర్ తప్పనిసరిగా అందించాలి.
- పత్రాలు స్వీకరించిన అనంతరం సంబంధిత వ్యక్తులకు రసీదు అందజేయబడుతుంది.

ధృవీకరణ కేంద్రం పనివేళలు

ధృవీకరణ ప్రక్రియ ప్రతి పని దినంలో ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు కొనసాగుతుంది. మండలాల వారీగా ప్రతిరోజు మొదటి 250 మంది ఖాతాదారుల ధ్రువపత్రాలను మాత్రమే పరిశీలించడం జరుగుతుంది.

మండలాల వారీగా ధృవీకరణ తేదీలు, ఖాతాల వివరాలు

ఖమ్మం జిల్లా పరిధిలోని బాధితుల సౌకర్యార్థం మండలాల వారీగా ధృవీకరణ తేదీలను కేటాయించడం జరిగింది. ఏ తేదీన ఏ మండలానికి చెందిన ఎంతమంది డిపాజిటర్లు హాజరుకావాలో వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

రోజు సంఖ్య తేదీ ఖమ్మం ఖాతాలు కవర్ చేసిన ఖమ్మం మండలాలు (ఖాతాలు)

1 25/11/2026 250 బోనకల్ (250)
2 26/11/2026 250 బోనకల్ (250)
3 27/11/2026 250 బోనకల్ (250)
4 28/11/2026 250 బోనకల్ (250)
5 30/11/2026 250 బోనకల్ (250)
6 01/12/2026 250 బోనకల్ (55); చింతకాని (195)
7 02/12/2026 250 చింతకాని (250)
8 03/12/2026 250 చింతకాని (250)
9 04/12/2026 250 చింతకాని (250)
10 05/12/2026 250 చింతకాని (215); ఏన్కూరు (35)
11 07/12/2026 250 ఏన్కూరు (250)
12 08/12/2026 250 ఏన్కూరు (250)
13 09/12/2026 250 ఏన్కూరు (250)
14 10/12/2026 250 ఏన్కూరు (136); కల్లూరు (114)
15 11/12/2026 250 కల్లూరు (250)
16 14/12/2026 250 కల్లూరు (250)
17 15/12/2026 250 కల్లూరు (250)
18 16/12/2026 250 కల్లూరు (33); కామేపల్లి (217)
19 17/12/2026 250 కామేపల్లి (250)
20 18/12/2026 250 కామేపల్లి (250)
21 19/12/2026 250 కామేపల్లి (250)
22 21/12/2026 250 కామేపల్లి (138); ఖమ్మం రూరల్ (112)
23 22/12/2026 250 ఖమ్మం రూరల్ (250)
24 23/12/2026 250 ఖమ్మం రూరల్ (250)
25 24/12/2026 250 ఖమ్మం రూరల్ (250)
26 28/12/2026 250 ఖమ్మం రూరల్ (86); ఖమ్మం అర్బన్ (164)
27 29/12/2026 250 ఖమ్మం అర్బన్ (250)
28 30/12/2026 250 ఖమ్మం అర్బన్ (250)
29 31/12/2026 250 ఖమ్మం అర్బన్ (250)
30 01/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
31 02/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
32 04/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
33 05/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
34 06/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
35 07/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
36 08/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
37 11/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
38 12/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
39 13/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
40 16/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
41 18/01/2027 250 ఖమ్మం అర్బన్ (250)
42 19/01/2027 250 ఖమ్మం అర్బన్ (205); కొణిజర్ల (45)
43 20/01/2027 250 కొణిజర్ల (250)
44 21/01/2027 250 కొణిజర్ల (250)
45 22/01/2027 250 కొణిజర్ల (250)
46 23/01/2027 250 కొణిజర్ల (250)
47 25/01/2027 250 కొణిజర్ల (250)
48 27/01/2027 250 కొణిజర్ల (250)
49 28/01/2027 250 కొణిజర్ల (250)
50 29/01/2027 250 కొణిజర్ల (250)
51 31/01/2027 250 కొణిజర్ల (153); కూసుమంచి (97)
52 01/02/2027 250 కూసుమంచి (250)
53 02/02/2027 250 కూసుమంచి (250)
54 03/02/2027 250 కూసుమంచి (250)
55 04/02/2027 250 కూసుమంచి (250)
56 05/02/2027 250 కూసుమంచి (250)
57 06/02/2027 250 కూసుమంచి (250)
58 08/02/2027 250 కూసుమంచి (83); మధిర (167)
59 09/02/2027 250 మధిర (250)
60 10/02/2027 250 మధిర (250)
61 11/02/2027 250 మధిర (250)
62 12/02/2027 250 మధిర (250)
63 15/02/2027 250 మధిర (250)
64 16/02/2027 250 మధిర (207); ముదిగొండ (43)
65 17/02/2027 250 ముదిగొండ (250)
66 18/02/2027 250 ముదిగొండ (250)
67 19/02/2027 250 ముదిగొండ (250)
68 20/02/2027 250 ముదిగొండ (250)
69 22/02/2027 250 ముదిగొండ (250)
70 23/02/2027 250 ముదిగొండ (250)
71 24/02/2027 250 ముదిగొండ (250)
72 25/02/2027 250 ముదిగొండ (250)
73 26/02/2027 250 ముదిగొండ (250)
74 27/02/2027 250 ముదిగొండ (243); నేలకొండపల్లి (7)
75 01/03/2027 250 నేలకొండపల్లి (250)
76 02/03/2027 250 నేలకొండపల్లి (250)
77 03/03/2027 250 నేలకొండపల్లి (250)
78 04/03/2027 250 నేలకొండపల్లి (250)
79 05/03/2027 250 నేలకొండపల్లి (250)
80 08/03/2027 250 నేలకొండపల్లి (250)
81 09/03/2027 250 నేలకొండపల్లి (250)
82 11/03/2027 250 నేలకొండపల్లి (250)
83 12/03/2027 250 నేలకొండపల్లి (250)
84 15/03/2027 250 నేలకొండపల్లి (250)
85 16/03/2027 250 నేలకొండపల్లి (250)
86 17/03/2027 250 నేలకొండపల్లి (250)
87 18/03/2027 250 నేలకొండపల్లి (42); పెనుబల్లి (208)
88 19/03/2027 250 పెనుబల్లి (250)
89 20/03/2027 250 పెనుబల్లి (50); రఘునాథపాలెం (200)
90 24/03/2027 250 రఘునాథపాలెం (163); సత్తుపల్లి (87)
91 25/03/2027 250 సత్తుపల్లి (250)
92 27/03/2027 250 సత్తుపల్లి (250)
93 29/03/2027 250 సత్తుపల్లి (250)
94 30/03/2027 250 సత్తుపల్లి (250)
95 31/03/2027 250 సత్తుపల్లి (250)
96 01/04/2027 250 సత్తుపల్లి (250)
97 02/04/2027 250 సత్తుపల్లి (250)
98 03/04/2027 250 సత్తుపల్లి (250)
99 06/04/2027 250 సత్తుపల్లి (4); సింగరేణి (246)
100 07/04/2027 250 సింగరేణి (250)
101 09/04/2027 250 సింగరేణి (250)
102 12/04/2027 250 సింగరేణి (115); తల్లాడ (135)
103 13/04/2027 250 తల్లాడ (250)
104 16/04/2027 250 తల్లాడ (250)
105 17/04/2027 250 తల్లాడ (250)
106 19/04/2027 250 తల్లాడ (250)
107 20/04/2027 250 తల్లాడ (250)
108 21/04/2027 250 తల్లాడ (250)
109 22/04/2027 250 తల్లాడ (209); తిరుమలాయపాలెం (41)
110 23/04/2027 250 తిరుమలాయపాలెం (250)
111 24/04/2027 250 తిరుమలాయపాలెం (250)
112 26/04/2027 250 తిరుమలాయపాలెం (250)
113 27/04/2027 250 తిరుమలాయపాలెం (250)
114 28/04/2027 250 తిరుమలాయపాలెం (186); వేంసూరు (64)
115 29/04/2027 250 వేంసూరు (250)
116 30/04/2027 250 వేంసూరు (250)
117 03/05/2027 250 వేంసూరు (250)
118 04/05/2027 250 వేంసూరు (209); వైరా (41)
119 05/05/2027 250 వైరా (250)
120 06/05/2027 250 వైరా (250)
121 07/05/2027 250 వైరా (250)
122 10/05/2027 250 వైరా (240); ఎర్రుపాలెం (10)
123 11/05/2027 250 ఎర్రుపాలెం (250)
124 12/05/2027 250 ఎర్రుపాలెం (250)
125 13/05/2027 250 ఎర్రుపాలెం (250)
126 14/05/2027 250 ఎర్రుపాలెం (250)
127 15/05/2027 115 ఎర్రుపాలెం (115)

కావున ఖమ్మం జిల్లా పరిధిలోని ఆగ్రిగోల్డ్ డిపాజిటర్లు, బాధితులు మరియు ఏజెంట్లు తమకు కేటాయించిన తేదీని గమనించి, అవసరమైన అన్ని అసలు పత్రాలు మరియు జిరాక్స్ కాపీలతో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ధృవీకరణ కేంద్రానికి హాజరై నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, ఖమ్మం పోలీస్ కమీషనర్ సూచించారు.

యన్నం వెంకటరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ఘన నివాళులు!



మధిర నవంబర్ 22(సికె న్యూస్)మధిర మున్సిపాలిటీ కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు తండ్రి యన్నం వెంకటరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా జిరుగుమాడు గ్రామంలో ఈరోజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులుఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, కాంగ్రెస్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, కౌన్సిలర్లు బానోత్ వెంకటరమణ నాయక్, శ్రీపాలశెట్టి వెంకట్రావు, ధారా నాగార్జున, పట్టణ కాంగ్రెస్ నాయకులు షేక్ జహంగీర్, సాలిక సురేష్, దోర్నాల నాగమురళి, రంజిత్ సాహు, బాడిశా రవి, దోర్నాల సంతోష్ తదితరులు పాల్గొని యన్నం వెంకటరావు కి ఘన నివాళులర్పించారు.

దుంప ఇంట పుష్పాలంకరణ,పంచల వేడుకహాజరై చిన్నారులను దీవించిన మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం సీనియర్ కాంగ్రెస్ నాయకులు



మధిర నవంబర్ 22(సికె న్యూస్) మధిర వైరా దుంపా శ్రీనివాసరెడ్డి – శైలజ దంపతుల కుమార్తె నేహిత రెడ్డి పుష్పాలంకరణ వేడుక,కుమారుడు విజయ్ నాగిరెడ్డి పంచల వేడుక ఆదివారం వైరాలోని మిట్టపల్లి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి.ఈ వేడుకలకు మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం హాజరై చిన్నారులను దీవించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, నేహిత రెడ్డి,విజయ్ నాగిరెడ్డి భవిష్యత్తు ఉజ్వలంగాఉండాలని,చదువుల్లోనూ అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.మధిర మండలం సిరిపురం గ్రామ సర్పంచ్ దుంపా వెంకటేశ్వరరెడ్డి – పద్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు బంధుమిత్రులు,శ్రేయోభిలాషులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మారెడ్డి దంపతులు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు సూర్యదేవర కోటేశ్వరావు టిడిపి పట్టణ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు

వేలాది మందికి ఉపయోగ పడుతున్న ఓల్డ్ క్లాత్ బ్యాంక్- గ్రీన్ ఫీల్డ్ హైవే కూలీలకు దుస్తులు పంపిణీ

ప్రతి ఆదివారం సంఘసేవ -లంకా



మధిరనవంబర్ 22(సికె న్యూస్). మధిర పట్టణం లోని స్థానిక అజాద్ రోడ్ లో ప్రముఖ సంఘ సేవకులు (మధిర ఆశ మిత్ర)లంకా కొండయ్య బృందం నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టలు కేంద్రం. హెల్పింగ్ హోమ్ ద్వారా ప్రతి ఆదివారం సామాజిక సేవలో భాగంగా ఈ రోజు మధిర నుండి విజయవాడ రోడ్ లో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే కూలీలు (నిదనపురం క్రాస్ రోడ్డు తరువాత ఉన్న మెగా ఇంజనీరింగ్ కంపెనీ వర్క్ షాప్ నందు పనిచేస్తున్న వారు) కు కొండయ్య వారిని మధిరలో తన ఇంటి వద్దకు పిలిపించి వారికీ కావలసిన దుస్తులు ఒక సంవత్సరానికి సరిపడ దుస్తులు 30 కుటుంబాలకు బీహార్, ఒడిస్సా, యూపీ, రాజస్తాన్ రాష్టాలు కూలీలకు కొండయ్య చేతులు మీదుగా పంచడం జరిగింది.ఈ దుస్తులను ప్రత్యేకశీగా ఖమ్మం నుండి దార్ల శ్రీనివాసరావు, వరంగల్ నుండి ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ విశ్రాంత సిఈఓ వంగూరి చంద్ర మోహన్, కో-ఆపరేటివ్ డిపార్ట్మెంట్ సీఈఓ దొండపాటి వీర భద్రం,మధిర టౌన్ సుందరయ్య నగర్ నివాసి యరమల సంజీవరెడ్డి, మహంకాళి వెంకట్ శ్రీనివాసరావు గోల్డ్ షాప్, రైతు సోదరులు మచ్చ నాగేశ్వరావు (శ్రీనగర్ కాలనీ)ఈనాడు రిపోర్టర్ నీరుకొండ మురళి, చావా నర్సింహారావు ఇంకా అనేక మానవతా దృక్పధం కలిగి ఎదుటి వారికీ ఉపయోగపడాలి ఏదో ఒక విధంగా అనే సహృదయం కల్గిన దాతలు బట్టలువితరణచేయగా...వాటిని నిరుపేదలకు, వలస కూలీ లకు సంచార జీవనం గడిపే కుటుంబాలకు పంచిపెట్టి మానవత్వం చాటుకుంటున్నారు అని కొండయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చేగుంటలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి,

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,

చేగుంట: చేగుంట పట్టణ కేంద్రంలోనీ ప్రాంతాల్లో పరిశ్రమలతో పాటు వ్యాపార, వాణిజ్య సంస్థలు అధికంగా ఉన్నందున ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆదివారం చేగుంటలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయిన ధనలక్ష్మి హార్డ్‌వేర్ షాపును ఎమ్మెల్యే పరిశీలించి, బాధిత వ్యాపారులను పరామర్శించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 నుంచి 60 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది ఉంటుంది అని తెలిపారు..

చేగుంట పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, ఇక్కడ ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తే చేగుంటతో పాటు చుట్టుపక్కల 30 నుంచి 40 గ్రామాలకు అగ్నిమాపక సేవలు తక్షణమే అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్, అగ్నిమాపక శాఖ అధికారులతో మాట్లాడి ఫైర్ స్టేషన్, ఫైర్ ఇంజన్, సిబ్బంది ఏర్పాటు కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫైర్ స్టేషన్ మంజూరు చేయడంతో పాటు అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధిత వ్యాపారులను ఆదుకోవాలని కోరారు.



శంషాబాద్‌లో హైడ్రా అధికారుల జులుం

- 6 ఎకరాల ఆర్టీసీ డిపో భూములపై కన్ను!
- సెలవు రోజుల్లోనే ఆర్టీసీ భూముల చుట్టు కంచెలు
- ప్రశ్నించిన ఆర్టీసీ అధికారులకు పోలీసులతో బెదిరింపులు ?

రాజేంద్రనగర్, నవంబర్ 22 (సికే న్యూస్) రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో హైడ్రా అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో ఏర్పాటైన హైడ్రానే ఇప్పుడు ప్రభుత్వ శాఖకు చెందిన భూములను ఆక్రమిస్తోందన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. సుమారు 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం శంషాబాద్‌లో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో శంషాబాద్ మండలం రషీద్ గూడ పరిధిలో 6 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆర్టీసీ డిపో నిర్మాణం కోసం అధికారికంగా 20 సంవత్సరాల క్రితం స్థలాన్ని కేటాయించింది. అప్పటి నుండి ఆ భూమి ఆర్టీసీ ఆధీనంలోనే ఉంది. డిపో విస్తరణ, భవిష్యత్ అవసరాల కోసం ఆ భూమిని ఆర్టీసీ కాపాడుకుంటూ వస్తోంది.

అయితే ఇటీవల హైడ్రా అధికారులు ఆ భూమిపై కన్నేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, సెలవు రోజును ఆసరాగా చేసుకుని హుటాహుటిన ఆర్టీసీ భూముల్లోకి ప్రవేశించి ఎఫ్టీల్ పరిధిలోకి వస్తుందని ఫెన్సింగ్, కంచె వేసే ప్రయత్నం చేశారని ఆర్టీసీ సిబ్బంది ఆరోపిస్తున్నారు.

అడిగితే బెదిరింపులా ?

విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న ఆర్టీసీ అధికారులు హైడ్రా అధికారులను ప్రశ్నించారు. ఇది 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం తమకు 6 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిన భూమి అని, రికార్డులు చూపించారు. అయినా వినకుండా హైడ్రా అధికారులు పోలీసుల సహాయంతో ఆర్టీసీ అధికారులనే బెదిరింపులకు గురిచేశారని ఆరోపణలు



వస్తున్నాయి.

ఒక ప్రభుత్వ శాఖ భూమిని మరో ప్రభుత్వ విభాగమైన హైడ్రా ఆక్రమించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన హైడ్రా, ఆర్టీసీ లాంటి ప్రజా రవాణా సంస్థ భూములపై పడటం విడ్డూరంగా ఉందని స్థానిక నాయకులు మండిపడుతున్నారు.

రికార్డుల పరిశీలనలో నిర్లక్ష్యమా ?

భూముల జోలికి వెళ్లే ముందు రెవెన్యూ రికార్డులు, కేటాయింపు ఉత్తర్వులు పరిశీలించకుండా హైడ్రా ఏకపక్షంగా వ్యవహరించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఈ విషయంపై హైడ్రా ఉన్నతాధికారులు స్పందించి, పూర్తి విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



సీ కే న్యూస్ చేగుంట /చేగుంట మండలంలోని చందాయిపేట గ్రామ పరిధిలో గల దేవుని చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చేట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన పసుల ఆంజనేయులు రాత్రి సమయంలో చేపలు పట్టేందుకు వల తీసుకొని దేవుని చెరువులోకి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చేపల వలలు చిక్కుకొని చెరువులో నీటిలో మునిగి మృతి చెందాడు.మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- తాజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్
- కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలో డాక్టర్ దీపిక ఆధ్వర్యంలో పల్స్ పోలియో విజయవంతం
- కొత్తూరులో పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన దేవేందర్ యాదవ్



షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు, జీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 22: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కొత్త మున్సిపాలిటీలో చిన్నారులను పోలియో మహమ్మారి బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తాజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆమె సూచించారు.ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ హాజరయ్యారు. డాక్టర్ దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్స్ పోలియో కార్యక్రమం దేశ ఆరోగ్య రంగంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని పేర్కొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో బండి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు చుక్కలు.. జీవితానికి వెలుగు



- చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ప్రతి ఒక్కరి బాధ్యత
- కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్
- స్టేషన్ తిమ్మాపూర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన వన్నాడ శివశంకర్ గౌడ్

షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూర్, సీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 22: రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో స్టేషన్ తిమ్మాపూర్ లో చిన్నారులకు వేసే రెండు పోలియో చుక్కలు వారి నిండు జీవితానికి రక్షణగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో చుక్కలు చిన్నారులను అంగవైకల్యం బారిన పడకుండా కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

చిన్న వయస్సులోనే పోలియో నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పిల్లలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చన్నారు. పోలియో వల్ల అంగవైకల్యం ఏర్పడితే బాధితులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ దీపిక ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు హైదరాబాద్ లో సౌర్య కన్వెన్షన్ హాల్ నందు యూసుఫ్ గూడా పోలీస్ స్టేషన్ లైన్ దగ్గర గద్వాల జిల్లా గా.ర్రా శ్రీనివాస్ రావు కుమారై వివాహం వేడుకలు లో సంధ్య ఖవనం స్వామి వివాహ వేడుకలు లో నూతన వధూవరులను లిఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి లి & లితనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి లి అక్షంత వేసి ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యాలతో కళకళలాడాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఎమ్మెల్యే వెంటనే వ్యవసాయం మార్కెట్ యాడ్ మాజీ చైర్మెన్ శ్రీధర్ గౌడ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ డివిజన్‌లో పల్స్ పోలియో

- మూడు రోజుల పాటు 35,315 మంది చిన్నారులకు పోలియో చుక్కలు
- 294 కేంద్రాలు ఏర్పాటు..
- 1,125 మంది వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బందితో ఏర్పాట్లు

షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూర్ సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 22 : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలోని చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్ పరిధిలో మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో ఐదేళ్లలోపు 35,315 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం 294 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని, 1,125 మంది వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఏ ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమంలో మిగిలిపోకుండా చూడాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వీధి విజయలక్ష్మి, చించోడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ అహమ్మద్, ఏఎన్ఎంలు నాగలక్ష్మి, శిరీష, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మాజీ జడ్పీటీసీ వెంకట్ రాంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్లు సి.పెంటయ్య, కళ్యాణకర్ దిలీప్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, జాంగారి రవి, వెలిజర్ల సర్పంచ్ బాబు నాయక్, నాయకులు శివ ఎస్పీ, సుజీవన్, చందులాల్, ముబారక్ అలీ ఖాన్, ఇబ్రహీం, కత్తి చంద్రశేఖర అప్ప, నాగమణి, మధువలు యాదవ్, తంగడపల్లి శంకర్, గుడిపల్లి బీరప్ప, మంగ అశోక్, రవితేజ, జయప్రకాష్, కరుణాకర్, నెహ్రూ నాయక్, జంగయ్య, రమేష్ తదితరులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు..



కనక దుర్గ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

- కనక దుర్గ ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేందుకు ఇప్పటికే రూ.5 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు వేయించిన ఆడే గజేందర్



సికె.న్యూస్. బజార్హత్నూర్
బజార్ హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామంలో నేడు నిర్వహించిన కనక దుర్గ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, స్థానిక సర్పంచ్ ప్రియాంక భుమేష్, స్థానిక నాయకులతో కలిసి కనక దుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ... కనక దుర్గ ఆలయానికి భక్తులు సులభంగా చేరుకునేందుకు ఇప్పటికే రూ.5 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు వేయించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఆలయం వరకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు త్వరలో మరో రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బజార్ హత్నూర్ మండల ఉపాధ్యక్షుడు రాథోడ్ రమేష్,సీనియర్ నాయకులు జాదవ్ గణేష్,మండల మైనారిటీ చైర్మన్ సయ్యద్ సల్మాన్,మండల ప్రధాన కార్యదర్శి గొల్లనాగు రమేష్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దేవేందర్ ముదిరాజ్ పోలియో చుక్కలు వేశారు
- కొత్తూరులో పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మాజీ కౌన్సిలర్ దేవేందర్ ముదిరాజ్



షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు, జీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 22: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూర్ మున్సిపాలిటీలో చిన్నారులను పోలియో మహమ్మారి బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దేవేందర్ ముదిరాజ్ అన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి దేవేందర్ హాజరయ్యారు. డాక్టర్ దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ.పల్స్ పోలియో కార్యక్రమం చిన్నారులకు ఆరోగ్య రంగంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని పేర్కొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి ఆరోగ్య,భద్రతకు,భరోసా,కల్పించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో హోరెత్తిన స్వేరోస్ 5కే రన్‌అక్షరం, ఆరోగ్యం, ఆత్మగౌరవమే ధ్యేయంగా యువత పరుగు



, సి కే న్యూస్ ఖమ్మం.నవంబర్ 22:(న్యూస్)
డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా స్వేరోస్ ఆధ్వర్యంలో ఆదివారం 'ప్రతిజ్ఞ దివస్' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం స్థానిక ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానం నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు 5 కిలోమీటర్ల పరుగు (5కే రన్) నిర్వహించారు. ఈ పరుగులో సుమారు 250 మంది విద్యార్థులు, యువతీయువకులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు.స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు కొండ్రు రామచంద్ర, కార్యదర్శి సోంపొంగు శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత ఆర్మీ అధికారులు అను, రామారావు, డాక్టర్ పి.వి. వీరస్వామి, భరత్ చంద్ర, ఆరెంపుల వీరభద్రం, శీలం ప్రసాద్, బండ్ల నాగేశ్వరరావు, భాస్కర్, మందుల వెంకన్న, చిలక నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారంతా స్వేరోస్ జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు.
అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో పురుషుల, మహిళల విభాగాల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలకు అతిథులు షీల్డులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆశయాలైన లి'అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం'లిఅనే నాలుగు సూత్రాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ప్రతిజ్ఞ దివస్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. యువత విద్య, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో రాణించి ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు, ప్రవీణ్ కుమార్ అభిమానులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రతి గడపగడపకు చేర్చండి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్



సికెన్యూస్.అదిలాబాద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని చిట్టచివరి లబ్ధిదారుడి వరకు చేర్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మండల అధ్యక్షులు అందరూ జిల్లా కమిటీ నాయకులు, మండల కమిటీ నాయకులు, గ్రామ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, స్థానిక సర్పంచులు, వార్డు మెంబర్లు, ఉపసర్పంచులు, ప్రభుత్వంలో వివిధ హోదాలలో పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకొని ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపగడపకు చేర్చాలని సూచించారు

రెండు చుక్కలు.. జీవితానికి వెలుగు పోలియో రహిత సమాజమే మన లక్ష్యం



మల్లాపూర్ సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం

షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 22 రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో చిన్నారులను పల్స్ పోలియో మహమ్మారిని నుంచి రక్షించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యముగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్మూలించి చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించడమే పల్స్ పోలియో కార్యక్రమం ప్రధాన లక్ష్యం. అని మల్లాపురం సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి అన్నారు ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమనీ ప్రారంభం చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో వ్యాధి అనేది చిన్నారులను శాశ్వత అంగవైకల్యానికి గురిచేసే ప్రమాదకరమైన వైరస్ వ్యాధి.
ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. గతంలో చుక్కలు వేయించినప్పటికీ ప్రభుత్వ కార్యక్రమంలో మరోసారి వేయించడం ఎంతో ముఖ్యం అని అన్నారు.ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసిన గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి ఉప సర్పంచ్ స్వరూప ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది . ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

గాంధీ భవన్‌లో పీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు



సికె.న్యూస్. అదిలాబాద్హైదరాబాద్ : గాంధీ భవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఖాజజ) అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన పీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి నూతనంగా నియమితులైన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ బీఏం సందీప్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (ణజజ) అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ గారు పాల్గొన్నారు.ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత విస్తరణ, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాబోయే రాజకీయ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

చిన్నమండవ లో 10 సిమెంట్ బల్లాలును దాతగా ఇచ్చిన నాగులవంచ సొసైటీ డైరెక్టర్ లక్ష్మణ్



సి.కె న్యూస్, చింతకాని ప్రతినిధి మండల పరిధిలో చిన్న మండవ గ్రామానికి చెందిన పర్చ గాని రాములు.ఎ/0. వెంకమ్మ... జ్ఞాపకార్థంగా,వారి కుమారుడు.పర్చగాని లక్ష్మణ్ (సొసైటీ డైరెక్టర్)ఎ/శీ అనసూయ సిమెంట్ కుర్చీ బల్లాలను వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పర్చగాని లక్ష్మణ్.. మరీదు లక్ష్మీనారాయణ.. మరియు నరేష్. పర్చగాని వేణు, పర్చగాని వెంకటేశ్వర్లు,పర్చగాని ఎల్లయ్య మోర్లకృష్ణ కందిమల్ల. బసవయ్యదవట్టెబోయిన రామారావు పర్చగాని కొట్టు వెంకటేశ్వర్లు పర్చగాని నాగేశ్వరరావు పర్చగాని కృష్ణ పర్చగాని నాగయ్య ,మొగిలి గోపయ్య మొగిలి గడ్డయ్య మొగిలి కిట్టయ్య. తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న అన్నదాన సత్రానికి భూమిపూజ

సి.కె. న్యూస్ -- వలిగొండ మండల ప్రతినిధి బాలరాజు. నవంబర్ 22. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం (వేములకొండ) గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న అన్నదాన సత్రం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. నిర్మాణం పూర్తయితే స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమమని, భక్తులకు అన్నప్రసాదం అందించడం గొప్ప ఆధ్యాత్మిక సేవ అని పేర్కొన్నారు. దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గరిసె రవి, స్థానిక సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆలయ ఈఓ వెంకటయ్య, అర్చకులు, దేవస్థాన కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పలు గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

మాజీ కౌన్సిలర్ రేటికల్ మీనానందీశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ



షాద్‌నగర్ నియోజకవర్గ కొత్తూర్ సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 22 షాద్‌నగర్ పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా పట్టణ మాజీ కౌన్సిలర్ రేటికల్ మీనానందీశ్వర్‌తో పాటు కక్కులూరు గ్రామానికి చెందిన రమాదేవి శ్రీనుగౌడ్, నర్సప్పగూడలో అప్పల మంజుల యాదయ్య, శంషాబాద్‌లో మంజుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నిర్వహించిన గృహప్రవేశ వేడుకలకు ఎమ్మెల్సీ హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న కుటుంబ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితాల్లో ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు,,అష్టైశ్వర్యాలు,వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సంతోషంగా, సౌభాగ్యంగా జీవించాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూపాల్, మాజీ ఎంపీటీసీ కట్న రవీందర్, మాజీ సర్పంచ్ రాజుగౌడ్, కంటెస్టెడ్ కౌన్సిలర్ నక్కల వెంకటేష్ గౌడ్, నర్సప్పగూడ కంటెస్టెడ్ సర్పంచ్ గోవిందు కవిత కర్ణప్ప, ఉపసర్పంచ్ సిద్ధయ్య, నాయకులు శంకరయ్యగౌడ్,సత్యనారాయణ గౌడ్, శివచారి, రమేష్ గౌడ్, పోచయ్య, సుధీర్, సాగర్, శేఖర్, కారే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోపరాజుపల్లికి నూతన బస్సు సర్వీసు ప్రారంభం

బస్సులో ప్రయాణించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



సి.కె. న్యూస్ -- వలిగొండ మండల ప్రతినిధి బాలరాజు. నవంబర్ 22.యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని గోపరాజుపల్లి గ్రామానికి నూతన బస్సు సర్వీసును భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా బస్సులో ప్రయాణించి గ్రామస్తులతో ముచ్చటించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ సలిగంజి పృథ్వీతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పలుమార్లు ప్రయత్నాలు చేశారు. వారి విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే కృషితో గోపరాజుపల్లి గ్రామానికి నూతన బస్సు సర్వీసు ప్రారంభం కావడం పట్ల గ్రామ సర్పంచ్ హర్షం వ్యక్తం చేశారు. నూతన బస్సు సర్వీసుతో గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ గ్రామశాఖ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (ఫూజూ) ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకుల సమావేశం



సికి న్యూస్ ప్రతినిధి ఇల్లందు. (జి కళ్యాణ్) నవంబర్ 22.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ఈరోజు బోడు గ్రామంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో బోడు ప్రాంతానికి రావాల్సిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (ఫూజూ) గురించి మాట్లాడటం జరిగింది.బోడు సొసైటీ పరిధిలోని బోడు,కొప్పురాయి,గంగారాం రెవిన్యూ గ్రామాలను కలుపుతూ ఈయొక్క పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలనీ కోరడమైనది.సమావేశంలో అన్ని పార్టీ నాయకులు పాల్గొని కచ్చితంగా బోడు ప్రాంతానికి (ఫూజూ)వచ్చే వరకు పోరాటం చేస్తాము అని మరియు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిసి మా యొక్క గోడు చెప్పుకుంటాం అని తీర్మానం చేయటం జరిగింది.ఈయొక్క సమావేశంలో అఖిలపక్ష నాయకులు,రైతులు పాల్గొనడం జరిగింది.

బిచ్చల యశోద కిఆర్ధిక సాయం.

మానవత్వం చాటుకున్న చింతకాని ఎలక్ట్రిషన్ అసోసియేషన్ సంఘం



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.మండల పరిధిలో గత 20 సంవత్సరముల నుండి చింతకాని గ్రామ ప్రజలకు ఎలక్ట్రిషన్ గా ఎన్నో సేవలను అందించి ఇటీవల అనారోగ్య కారణంతో మృతి చెందిన చింతకాని గ్రామానికి చెందిన బిచ్చల రామారావు కి నివాళు లర్పించి మానవతా దృక్పథంతో తోటి ఎలక్ట్రిషన్ అయినందున వారి సతీమణి అయిన యశోద కి చింతకాని ఎలక్ట్రిషన్ అసోసియేషన్ తరపున కొంత నగదును ఆర్థిక సహాయముగా అందజేయడం జరిగింది యూనియన్ సభ్యులు ఎస్ కే యాసీన్ ఎస్.కె కాసిం ఎస్ కే ముజీమ్ కే కోట గొట్టం వీరభద్రం దారిపల్లి వీరభద్రం తేనె శ్రీనివాసరావు (అలియాస్)డాన్ శ్రీను జాల చంద్రశేఖర్ బండి కిషోర్ ఎస్ కే జానీ సూత్రపు రాంబాబు ఎస్.కె అజీ మ్ లచ్చగూడెం చారి కొరివి నరసింహారావు ఎస్ కే జానీ ఎమ్మార్వో కాలనీ ఈ కార్యక్రమం లో తదితరులు పాల్గొన్నారు

పాట మాట, నినాదాలతో మద్దతు ప్రకటించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి.



సి కె న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్:జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపు కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు ఎం.పి.ఈటెల రాజేందర్, అధికార కాంగ్రెస్ డిసిసి వజ్రేష్ యాదవ్ కూడ మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి.మొదటి రోజు రిలేదీక్ష కార్యక్రమం విజయవంతం అని ప్రకటించిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్.మద్దతు ప్రకటించి, దీక్షలో పాల్గొన్న యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసి, తదితరులు.ఆకట్టుకున్న జాన్, వెంకటాచారి ఉద్యమ పాటలు.జవహర్ నగర్ డంపింగ్ యార్డును ఎన్నికలలో ఇచ్చిన హామీలో బాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే తొలగించి, కొత్త చెత్తను రాంకీ డంపింగ్ యార్డుకు తీసుకురావడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన రిలే నిరాహార దీక్షల మొదటి రోజు కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ జేఏసి చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ ప్రకటించారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా, కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని చెన్నాపురం చౌరస్తాలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో 2026, నవంబర్-22, ఆదివారం రోజున రిలే దీక్షలు ప్రారంభమయ్యాయని అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి గారు జవహర్ నగర్ బి ఆర్ ఎస్ మాజీ మేయర్ మేకల కావ్య జవహర్ నగర్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్ హాజరై, తమదైన శైలిలో పాట, మాట, నినాదాలతో అత్యంత ఉత్సాహ బరితంగా రిలేదీక్షలను ఉత్తేజపరిచి సంఘీభావం తెలిపారని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా జవహర్ నగర్ ప్రజలు డంపింగ్ యార్డు కాలుష్యంతో నరకం అనుభవిస్తున్నారని, దుర్వాసన, కలుషిత నీరు, విషపూరిత గాలితో పిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం మొత్తం చెత్తను ఒకే చోట వేయడం వల్లే ఈ సమస్య వచ్చిందని, చెత్తను డిసెంట్రలైజ్ చేసి, నాలుగు మూలలా చిన్నచిన్న ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును శాస్త్రీయంగా మూసివేసే వరకు, కొత్త చెత్త రాకుండా ఆపే వరకు ఈ రిలే దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రోజుకు ఇద్దరు చొప్పున మరణిస్తున్నారని ఇది బాధకరమైన విషయమని ఆవేదన చెందారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పాత చెత్తను రీసైకిల్ చేసి, యార్డును తొలగించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఇటు డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి, అటు దమ్మాయిగూడ జేఏసి వాళ్ళతో కలిసి ఐక్యంగా ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని మల్లారెడ్డి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో యాంటి డంపింగ్ యార్డు జేఏసీ దమ్మాయిగూడ నాయకులు, వివిధ పార్టీల, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రిలే దీక్షలను విజయవంతంగా ముగిశాయని తెలియజేశారు.
సిపిఐ దర్శనం యాదగిరి, నిమ్మల నర్సింహ్మ, సిపిఎం శివన్నారాయణ, కె.సురేందర్, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జయసుధ, సురేందర్, బీఎస్పీ బిర్రు యాకస్వామి, ఆమ్ ఆద్మీ పార్టీ మోహన్, టిఆర్ఎస్ మేక లలిత యాదవ్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ వి.ప్రవీణ్, డి.స్వరూప, ఎం.ఎల్.పి.ఐ.(రెడ్ ఫ్లాగ్) ఖాసీం, లింగస్వామి టిజేఎస్ ఎం.శ్రీనివాస్, టిడిపి టి.శ్రీరాములు, టియుజేఏసి ఎ.లలిత, డి.లలిత మరియు యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసి సమ్మిరెడ్డి, స్వర్ణ తమ సంపూర్ణ మద్దతును తెలియజేసి, దీక్షలో పాల్గొన్నారు. టియుజేఏసి తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, పిఓడభ్ల్యూ సంధ్య, సిఎంఎస్ సత్య, పికెఎం జాన్, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, బహుజజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మహ్మద్ పాషామియా, టి.కాలేషా, ప్రజానాట్యమండలి వెంకటాచారి, ఉద్యమ కళాకారుల వేదిక యాదగిరి, మహిళా విబాగం సుజి, పిఓడభ్ల్యూ(విముక్తి) గడిపే సునీత, సిఎంఎస్ జయ, కార్మికనగర్ దామాల ప్రబాకర్, శ్రీనివాస్, పిడిఎం రవి, సిజేపి శ్రావణ్ కుమార్ తదితర సంఘాలు దీక్షలకు హాజరై సందేశాలు ఇచ్చిన వారిలో ఉన్నారు.డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జాన్, వెంకటాచారి కళాకారులు ఆలపించిన ఉద్యమ పాటలు ఆకట్టుకొని, దీక్షలో పాల్గొన్న వారికి ఎంతో ఉత్తేజాన్నిచ్చాయి.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ఫూజూ) అఖిలపక్ష సమావేశం ఏర్పాటు



సికి న్యూస్ ప్రతినిధి ఇల్లందు. (జి కళ్యాణ్) నవంబర్ 22.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ఈరోజు బోడు గ్రామంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో బోడు ప్రాంతానికి రావాల్సిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (ఫూజూ) గురించి మాట్లాడటం జరిగింది.బోడు సొసైటీ పరిధిలోని బోడు,కొప్పురాయి,గంగారాం రెవిన్యూ గ్రామాలను కలుపుతూ ఈయొక్క పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలనీ కోరడమైనది.సమావేశంలో అన్ని పార్టీ నాయకులు పాల్గొని కచ్చితంగా బోడు ప్రాంతానికి (ఫూజూ)వచ్చే వరకు పోరాటం చేస్తాము అని మరియు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిసి మా యొక్క గోడు చెప్పుకుంటాం అని తీర్మానం చేయటం జరిగింది.ఈయొక్క సమావేశంలో అఖిలపక్ష నాయకులు,రైతులు పాల్గొనడం జరిగింది.

మాచర్లలో గ్రామీణ న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం

గ్రామీణులకు ఉచిత న్యాయ సేవలు అందించడమే లక్ష్యం: సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు



గట్టు నవంబర్22:జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని మాచర్ల గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గద్వాల వారి ఆధ్వర్యంలో విలేజ్ లీగల్ ఎయిడ్ క్లినిక్ (గ్రామీణ న్యాయ సహాయ కేంద్రం)ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గౌరవనీయులు నాగరాజు హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. గతంతో పోలిస్తే నేడు సమాజంలో అనేక మార్పులు వచ్చాయని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రజలకు న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు తగిన సహాయం అందించేందుకు ఇలాంటి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.
అనంతరం గ్రామ సర్పంచ్ బి. వజ్రమ్మ తిమ్మప్ప మాట్లాడుతూ మాచర్ల గ్రామంలో విలేజ్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేసి ప్రారంభించినందుకు సీనియర్ సివిల్ జడ్జి నాగరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జడ్జి సూచించిన అంశాలను తప్పనిసరిగా పాటిస్తూ గ్రామంలో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు, గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా ముందుంటానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో గట్టు ఎస్సై ఎం. కళ్యాణ్ కుమార్, సీనియర్ అడ్వకేట్ యుగంధర్, మాచర్ల గ్రామ ఉపసర్పంచ్ పెద్దింటి సుదర్శన్, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, వార్డు సభ్యులు జి. రాజేష్, ఎండి. షేక్షావలి, చంద్రకాంత్, మాజీ వార్డు సభ్యుడు హుస్సేన్, బి. లోకేష్, సి. రాముడు, గద్వాల వీరేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం నాయకత్వంలో నెరవేరినది

మల్దకల్ మండలం ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే సతీమణి లి



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు గద్వాల నియోజకవర్గం
మల్దకల్ మండలం పరిధిలోని కుర్తి రావులచెరువు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లిఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి హాజరయ్యారు. మల్దకల్ మండలం గ్రామంలో కుర్తిరావులచెరువు గ్రామం చెందిన రాముడు కు మంజూరు కావడం జరిగినది . నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే సతీమణి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సతీమణి కానుకను అందజేశారు .
ఎమ్మెల్యే సతీమణి కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.
ఎమ్మెల్యే సతీమణి మాట్లాడుతూ ....
నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది.
గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు.ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు.
ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం శ్రీ రేవంత్ రెడ్డి కి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరఫున ధన్యవాదాలు .....
ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ...
ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి సారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం కి మంత్రి కి మా ఎమ్మెల్యే కి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, అంజనేయులు, భాస్కర్ గౌడ్, కిరణ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.